రామయ్యకు స్వర్ణ పుష్పార్చన

నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చక స్వామి

భద్రాచలం, మార్చి 24 : భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో ఆదివారం సందర్భంగా అంతరాలయంలోని మూలవరులకు 108స్వర్ణ పుష్పాలతో అర్చన జరిపారు. ఉదయం అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొని వచ్చి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపించారు.

నేడు నిత్యకల్యాణం, ముత్తంగి అలంకరణ నిలిపివేత

హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించడంతో పాటూ స్వామివారి పెండ్లి పనుల కోసం పసుపు కొమ్ములు దంచుట, తలంబ్రాలు కలుపుట తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నందున రామయ్యకు నిత్యం జరిపే కల్యాణాన్ని సోమవారం నిలిపివేస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి తెలిపారు. అలాగే స్వామివారికి ప్రతి సోమవారం జరిపే ముత్తంగి అలంకరణను నిలిపివేస్తున్నామని, భక్తులు ఈ విషయాన్ని గమనించుకోవాలని ఆమె కోరారు.

రామయ్య కల్యాణ తలంబ్రాలకు 12 టన్నుల బియ్యం వితరణ

బియ్యాన్ని దేవస్థానం ఈఓకు అందజేస్తున్న సభ్యులు

భద్రాచలం, మార్చి 24 : భద్రాచలం సీతారామచంద్రస్వామివారి కల్యాణ తలంబ్రాలకున్న విశిష్టతను తెలుసుకున్న జంగారెడ్డిగూడెం శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి సభ్యులు ఉభయ గోదావరి జిల్లాల నుంచి సేకరించిన 12టన్నుల 8క్వింటాళ్ల బియ్యాన్ని ఆదివారం దేవస్థానం ఈవో ఎల్ రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ముళ్లపూడి సత్యనారాయణ మాట్లాడుతూ.. తాము తీసుకువచ్చిన బియ్యాన్ని తలంబ్రాల కోసం వినియోగించవలసిందిగా దేవస్థానం ఈవోను కోరారు. కార్యక్రమంలో దేవస్థానం వేద పండితులు లింగాల ప్రసాద్ శర్మ, ఆలయ సూపరింటెండెంట్ నిరంజన్, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించవద్దు

అలాంటి వారు ఎవరైనా ఉంటే మా దృష్టికి తీసుకురండి

ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్


మాట్లాడుతున్న ఏరియా జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు రూరల్, మార్చి 24 : నూతనంగా ఏర్పాటు కాబోయే ఉపరితల గనిలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ తిరుగుతున్న దళారుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. ఆదివారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కొంత మంది దళారులు ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువతీ, యువకులను మోసం చేస్తున్నారన్న సమాచారం మా దృష్టికి వచ్చిందన్నారు. సింగరేణి సంస్థ ఉపరితల గనికి సంబంధించిన ఉద్యోగ నియామక ప్రక్రియను చేపట్టలేదన్నారు. అటవీ, ఇతర అనుమతులు ఇంకా రావాల్సి ఉందన్నారు. ఏమైనా ఉద్యోగావకాశాలు (కాంట్రాక్టు పద్ధతిలో) ఉంటే ఇల్లెందు ఏరియా సింగరేణి సంస్థ అధికారికంగా ప్రకటన విడుదల చేస్తుందన్నారు. దళారులను ఆశ్రయించి డబ్బులు చెల్లించి మోసపోవద్దని సూచించారు. అలాంటి వారు ఎవరైనా ప్రజలను మభ్యపెడుతుంటే మా దృష్టికి తీసుకురావాలని వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. వివరాలను తెలియజేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. దళారులకు, సంస్థ యాజమాన్యానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

భద్రాద్రి నియోజకవర్గ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు

భద్రాచలం, మార్చి 24 : భద్రాచలం నియోజకవర్గ ప్రజలందరూ హోలీ పండుగను ఆనందోత్సహాలతో జరుపుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆకాంక్షించారు. ప్రతిఏడాది కాముని దహనం జరిపిన తరువాత మరుసటి రోజు పౌర్ణమి రోజు హోలీ పండుగను జరుపుకుంటామని తెలిపారు. హోళీ పండుగను సహజమైన రంగులతో తయారు చేసిన నీటిని చల్లుకోవాలని, ఆర్టిపిషియల్ రంగులతో తయారు చేసిన నీటిని చల్లుకోవద్దని అన్నారు. రంగులు చల్లుకున్న తరువాత ఇంటి వద్దనే స్నానాలు చేయాలని, వాగులు, చెరువులు, గోదావరి వద్దకు వెళ్లి స్నానాలు చేయకూడదని అన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియేట్ పరీక్షలు అయిపోవడంతో విద్యార్థులు సరదాగా గోదావరిలోకి ఈతకు వెళుతుంటారని, తల్లిదండ్రులు వారిని ఈతకు వెళ్లకుండా చూడాలన్నారు.

సర్కారు తోటలో తటాకం!

చుంచుపల్లి మండలం గరిమళ్లపాడు నర్సరీలో అక్రమంగా తవ్విన చెరువు

- గరిమళ్లపాడు ఉద్యాన నర్సరీలో అక్రమ తవ్వకం
- లీజుమాటున కంట్రాక్టర్ నిర్వాకం
- చోద్యం చూస్తున్న అధికారులు

నర్సరీ ప్రదేశంలో లీజుకు ఇచ్చిన మామిడి, కొబ్బరితోటలు

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 24 (నమస్తే తెలంగాణ) : జానెడు జాగ దొరికితే చాలు.. బారెడు అక్రమం చేయడానికి సిద్ధమవుతారు అక్రమార్కులు. సర్కారు భూమిలో ఉన్న మామిడితోటలో ఓ కంట్రాక్టర్ ఏకంగా చెరువునే తవ్వేస్తున్నాడు. అటువైపు ఎవరూ రారన్న ధైర్యంతో లీజుకు తీసుకున్న మామిడితోటలో చెరువుని నిర్మిస్తున్నాడు. వివరాల్లోకెళ్తే.. చుంచుపల్లి మండలం గరిమళ్లపాడు ఉద్యానవనంలో మామిడి, కొబ్బరి, నిమ్మ, జీడిమామిడి, సపోట పండ్ల మొక్కలు చాలా ఎకరాల్లో ఉన్నాయి. ఈ తోటలను ప్రతి ఏటా ఐటీడీఏ ఆధ్వర్యంలో కేవలం ఫలసాయం పొందడం కోసం వేలం వేస్తారు. ఇదే క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నాలుగేళ్లకు లీజుకు వేలంపాట పెట్టారు. ఉద్యాన కమిటీ ద్వారా నిర్వహించే ఈ పాటకు చైర్మన్‌గా ఐటీడీఏ పీవో ఉంటారు. జిల్లా ఉద్యాన అధికారి, ఐటీడీఏ ఉద్యాన అధికారులతోపాటు తహసీల్దార్ కూడా కమిటీలో ఉంటారు. నాలుగేళ్లకు లీజులో పాల్వంచకు చెందిన కంట్రాక్టర్ ఒకరు 6 లక్షల ఒక వెయ్యికి పాటను దక్కించుకున్నారు. ఇదంతా ఒక ఎత్తైతే లీజుకు తీసుకున్న ప్రదేశంలో అక్రమంగా చెరువు తవ్వడం మరో ట్విస్టుగా మారింది.

లీజుమాటున అక్రమం

గరిమళ్లపాడు ఉద్యానవనంలో అక్రమం చోటుచేసుకున్నది. తోటలను పెంచడానికి అందులో బోర్లు ఉన్నా సదరు కాంట్రాక్టర్ అక్రమంగా చెరువును తవ్వుకోవడం విడ్డూరంగా ఉంది. ఒకవేళ చెరువు అవసరం ఉంటే అధికారుల అనుమతి తీసుకోవాలి.. కాని ఎలాంటి అనుమతులు లేకుండా రెండునెలల నుంచి తోటల మధ్యలో చెరువును తవ్వడంపై అధికారుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజంగా అది తోటల కోసం వేసే చెరువేనా లేక చేపల పెంపకం కోసం తవ్వుతున్న చెరువా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగా నీటి సదుపాయం కోసం చెరువు అయితే బయట ఉన్న బోరు నుంచి మోటార్ కనెక్షన్ లైన్ ఎందుకు ఇస్తున్నారో దానిని చూస్తే అర్థం అవుతుంది. నిజంగా తోటల కోసం అయితే అధికారులతో చెరువు తవ్వించాల్సి ఉంటుంది. కంట్రాక్టర్ ఎందుకు చెరువు తవ్విస్తున్నారో అర్థం కాని విషయం.

గరిమళ్లపాడులో తోటల వివరాలు

గరిమళ్లపాడు ఉద్యానవనంలో ఏనాటి నుంచో ఉద్యానవనం ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. ఒకప్పుడు కళకళలాడిన ఉద్యానవం.. నేడు మొక్కలు లేక కళావిహీనం అయ్యింది. ఎండిపోతున్న మొక్కలతో ఎండమావిగా మారింది. ప్రస్తుతం మామిడి మొక్కలు 800, నిమ్మ రెండు ఎకరాల్లో, కొబ్బరి 140 మొక్కలు, సపోటా 80 మొక్కలు ఇంకా ఇతర మొక్కలు కూడా ఉన్నాయి. వీటి ఫలసాయం పరులపాలవకుండా ప్రతి ఏటా ఏడాది లీజుకు ఇస్తున్నారు. వాటి లెక్కలు కూడా అడిగేవారు లేరు. దీంతో ఎవరికివారు యమునా తీరు చందంగా ఉంటే కాంట్రాక్టర్ అక్రమానికి తెరలేపాడు.

పట్టింపులేని అధికారులు

30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ నర్సరీలో ఏపుగా పెరగాల్సిన పండ్ల మొక్కలు నీరు లేక ఎండిపోతున్నాయి. మొక్కల ఆలనాపాలన చూడాల్సిన ఐటీడీఏ అధికారులు కూడా అటువైపు తలెత్తడం లేదు. ఊరికి దూరంగా ఉండడంతో రాత్రి సమయంలో మందుబాబులకు అడ్డాగా మారింది. అసాంఘిక కార్యక్రమాలకు సైతం స్థావరంగా మారింది.

మా దృష్టికి ఇప్పుడే వచ్చింది

గరిమళ్లపాడు ఉద్యానవనాన్ని లీజుకు ఇచ్చాం. అధికారికంగా వేలంపాట నిర్వహించాము. నాలుగేళ్ల పాటు రూ.6 లక్షలకు లీజుకు ఇచ్చాం. అందులో తోటలకు నీరు పెట్టుకోవడానికి మోటార్ కూడా ఉంది. కొన్ని రిపేర్లు ఉన్నాయి. కాని చెరువు తవ్వుతున్నట్లు మా దృష్టికి ఇప్పుడే వచ్చింది. మేము ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. కంట్రాక్టర్‌కి నోటీసులు ఇస్తాం. ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్తాం. అక్కడ వాచ్‌మెన్ కూడా ఉంటారు.

– అశోక్, హార్టికల్చర్ అధికారి, ఐటీడీఏ

వ్యవసాయం.. ఆమె వ్యాపకం

అందరిలాగే ఆమె కూడా. కానీ అందరిలోనూ ఆమె కాస్త ప్రత్యేకం. ముఖ్యంగా సాగు రంగంలో మరికొంత అద్భుతం. కండలు తిరిగిన పురుషులకే కష్టతరంగా ఉండే సాగుక్షేత్రంలో ఆమె వారికి దీటైన కర్షకురాలిగా నిలుస్తోంది. రోజంతా నడుమొంచి, చెమటోడ్చి చేస్తున్న వ్యవసాయం ఆమెకు కష్టం కాదు. ఎందుకంటే అది ఆమె వ్యాపకం. ఐదు పదులు దాటాక కూడా ఇంతలా శ్రమించొద్దంటూ ఆమె పిల్లలు వారించినా వదులుకోలేనంత మక్కువ. అందుకే ఆమె ఈ వయసులోనూ పంటల సాగులో విరామంలేని జీవనాన్ని కొనసాగిస్తోంది. విధి వక్రీకరించి భర్తను తీసుకెళ్లినా ఆమె కుంగిపోలేదు. కొంగు బిగించి కార్యక్షేత్రంలోకి దిగింది. భర్త ధైర్యాన్ని కూడదీసుకొని అవిశ్రాంతంగా శ్రమించింది. ముగ్గురు పిల్లలనూ ప్రయోజకులను చేసింది. వారికి వివాహ కార్యాలు జరిపించింది. అంతటితో ఆమె తన కుటుంబ కావడి మోసేందుకే పరిమితం కాలేదు. అరకపట్టి అందరికీ ఆదర్శప్రాయంగానూ నిలుస్తోంది. అర ఎకరా పొలంలో పది రకాల పంటలు వేస్తూ పదుగురికి స్ఫూర్తినిస్తోంది. కండలు తిరిగిని వాళ్లే కాడి ఎత్తేసే కార్యక్షేత్రంలో కూలీలకు ఉపాధినిస్తూ, కస్టమర్లకు క్వాలిటీనిస్తూ జీవనయానం సాగిస్తోంది. విశ్వసనీయ వ్యాపారానికి మారుపేరుగా నిలవడంతో వినియోగదారులు కూడా ఆమె వద్దకు క్యూ కడుతుంటారు. ఆమె పండించిన పంటలను.. పొలం వద్దకే వచ్చి కొనుగోలు చేసేవారు కొందరైతే.. పొరుగు సంతల్లోనూ ఆమె వద్దనే కూరగాయలు కొనేవాళ్లు మరికొందరు. సంతలో సాయంత్రం దాకా సరుకులు అమ్మడం ఆమె సహజత్వం కాదు.. పగటి వేళలోపే పంటనంతా అమ్మేసి పట్టాలు మడతపెట్టుకొని తిరుగు పయనమై వెళ్లడం ఆమె ప్రత్యేకం. ఆమె ఎవరో కాదు.. కార్య'క్షేత్రం'లో కష్టాలకు ఎదురీదిన కోటమ్మ.

–కూసుమంచి, మార్చి 24

- భర్త కాలం చేసినా కుంగిపోకుండా కొంగు బిగించిన గిరిజన మహిళ
- అవిశ్రాంతంగా శ్రమించి ముగ్గురు పిల్లలకూ వివాహ కార్యాలు
- ఐదు పదులు దాటినా పంటల సాగులోనే విరామంలేని జీవనం
- అర ఎకరం పొలంలో పది రకాల పంటల సేద్యంతో ఆదర్శం
- పంట పొలాల్లోనూ 'ఆమే..', పొరుగూరి సంతల్లోనూ 'ఆమే..'
- కూలీలకు ఉపాధినిస్తూ, కస్టమర్లకు క్వాలిటీనిస్తూ పయనం..
- విశ్వసనీయ వ్యాపారంతో వినియోగదారులూ 'ఆమె' వద్దకే..
- కష్టతరమైన 'క్షేత్రం'లో పురుషులకు దీటైన కర్షకురాలు.. ఈ 'కోటమ్మ'

భర్త కాలం చేసినా కుంగిపోకుండా..

కూరగాయల సాగుకు ప్రసిద్ధి చెందిన కూసుమంచి మండలం ధర్మతండా గ్రామం.. ఈ గిరిజన మహిళ అయిన జర్పుల కోటమ్మ స్వస్థలం. ఆరేళ్ల క్రితం ఆమె భర్త కాలం చేశాడు. కానీ అప్పటికే వారికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. భర్త అకాల మరణం ఆమె నెత్తిన పెద్ద బరువునే పెట్టింది. కానీ ఆ బరువుకు ఆమె కుంగిపోలేదు. కన్న పిల్లలను చూసి కాస్త ధైర్యం తెచ్చుకొని లేచి కొంగు బిగించింది. కాడి పట్టి క్షేత్రంలోకి దిగింది. అప్పటికే ఆమెకు వ్యవసాయమంటే ఎంతో మక్కువ. దీంతో అది కఠినమైన పని అయినా ఆమెకు కష్టమనిపించలేదు. ఏళ్లు తిరగకుండానే పిల్లలను ప్రయోజకులను చేసింది. కుమారుడు ప్రభుత్వ ఉద్యోగిగా స్థిరపడ్డాడు. కుమార్తెలను కలిగిన కుటుంబాలకే ఇచ్చి కల్యాణం జరిపించింది. కానీ తాను మాత్రం విశ్రాంతి కోరుకోలేదు. వ్యవసాయాన్ని తన వ్యాపకంగా భావించింది. అందులోనే జీవిస్తోంది.

వ్యవసాయం.. వైవిధ్యం..

వ్యవసాయమంటే ఎంతో మక్కువైన కోటమ్మ.. దానిని ఎంతో వైవిధ్యంగా చేస్తోంది. అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ పొలంలో శ్రమిస్తుంది. అర ఎకరా పొలంలో పది రకాల పంటలు సాగు చేస్తూ అద్భుతాలు సృష్టిస్తోంది. కూరగాయలు, ఆకు కూరలు, బంతి పూల వంటివి సాగు చేస్తోంది. ఇంట్లో తిండి గింజలకు కాస్త వరి పంటనూ పండిస్తోంది. అయితే విచ్చలవిడి రసాయనాల వినియోగాన్ని ఆమె పెద్దగా ప్రోత్సహించదు. సేంద్రియానికి ప్రథమ ప్రాధాన్యమిస్తోంది. తాను పండించిన పంటలను సోమ, బుధ, శుక్రవారాల్లో కూసుమంచి, నాయకన్ గూడెం, పాలేరు సంతల్లో పూర్తిగా విక్రయించేస్తుంది. ఇన్నేళ్లుగా ఉన్న పరిచయాలు, అందిస్తున్న నాణ్యతా ప్రమాణాల కారణంగా చాలామంది వినియోగదారులు ఆయా సంతాల్లో ఆమె వద్దనే కూరగా యాలు కొనుగోలు చేస్తారు. నిండుగా కూరగాయాలు, ఆకుకూరలతో సంతకు వచ్చే ఆమె.. ఆ తరువాత మూడు నాలుగు గంటల్లోనే వాటన్నింటినీ విక్రయించేసి ఇంటికి పయనమై వెళ్తుంది. సమీప గ్రామాల్లో ఉండే వినియోగదారులు నేరుగా ఆమె పొలం వద్దకే వెళ్లి కూరగాయలను కొనితెచ్చుకుంటారు. ఇక ఫంక్షన్లు, ఇతర కార్యక్రమాల కోసం పెద్ద సంఖ్యలోనే ఆమె పొలం దగ్గరకు వెళ్తారు. ఆమె దగ్గర అందుబాటులో లేకపోతేనే మరో పొలం దగ్గరకు వెళ్తారు.

కూరగాయలు, ఆకు కూరలే అధికం..

అర ఎకరంలో పూర్తిగా ఆకు కూరలు, కూరగాయలే పండిస్తుంది. వాటిల్లో ప్రధానంగా పాలకూర, తోటకూర, బచ్చలికూర, పుదీనా, కొత్తిమీర, మెంతికూర ఉంటాయి. ఇక కూరగాయల్లో అయితే చిక్కుడు, టమాటా, బెండ, వంకాయలు, గోరుచిక్కుడు ఉంటాయి. వీటితోపాటు నీజన్లను బట్టి క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బంతిపూలు వంటివి కూడా పండిస్తుంది. కూరగాయలను రెండు రోజులకు ఒక సారి కోసుకొని వెళ్లి వారపు సంతల్లో విక్రయిస్తుంటుంది. నమ్మకం, విశ్వాసం పొందిన వినియోగదారులు నేరుగా ఈమె వద్దకే వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఎండ, వాన, చలి వంటివి ఎన్ని కాలాలు వచ్చిపోతున్నా ఆమె కాలు మాత్రం తన 'క్షేత్రం'లోనే ఉంటుంది. ఎప్పుడూ ఒంటరిగా పనిచేస్తూనే కన్పిస్తుంది.

కూసుమంచి సంతలో కూరగాయల బేరం చేస్తున్న కోటమ్మ

పని అధికంగా ఉన్న రోజు కూలీలను పెట్టుకుంటా..

పనిచేసుకుంటూ బతకడమే నాకు సంతోషం. 10 రకాల కూరగాయలను సాగు చేస్తా. పని ఎక్కువగా ఉన్న రోజు మరికొందరు కూలీలను పెట్టుకుంటా. పొలంలో నేనే పాటు చేస్తా. విత్తనాలు పెడతా. క్రిమిసంహారక మందు చల్లుతా. నీళ్లు కడతా. రోజువారీ ఆకు కూరలు, కూరగాయలను కూడా నేనే కోస్తా. ఇంతలా కష్టపడొద్దని పిల్లలు చెబుతుంటారు. కానీ మొదటి నుంచీ నమ్ముకున్న వ్యవసాయం కదా.. ఇందులో ఉంటేనే సంతోషంగా అనిపిస్తుంది. కొందరు రిటైల్ కూరగాయల వ్యాపారులు కూడా ఇక్కడికి వచ్చి నా పొలంలో కూరగాయలను కొనుక్కొని వెళ్తుంటారు. నేను కూడా నాలుగు సంతల్లో కూరగాయలు, ఆకు కూరలు విక్రయిస్తుంటా. పొద్దంత కష్టపడినా పెద్దగా శ్రమించినట్లు అనిపించదు.

–కోటమ్మ, మహిళా రైతు, ధర్మతండా, కూసుమంచి

బీఆర్ఎస్‌లో చేరిన బీఎస్పీ ముఖ్యనేతలు

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న బీఎస్పీ ముఖ్యనాయకులు

బూర్గంపహాడ్, మార్చి 24 : బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ నాయకత్వంపై నమ్మకంతో ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌తోపాటు మాజీ ఎంపీ కేశవరావు, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌ల సమక్షంలో జిల్లాలోని బీఎస్పీ ముఖ్యనేతలు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీ. రమణ, మాజీ జిల్లా సలహాదారు గాడిద దామోదర్, మాజీ జిల్లా ఇన్‌చార్జ్ నల్లగట్ల రఘు, మాజీ జిల్లా మహిళా కన్వీనర్ బండి రమణి ఆధ్వర్యంలో జిల్లాలోని 52 మంది ముఖ్యనేతలతో కలిసి బీఆర్ఎస్‌లో చేరినట్లు రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల యుద్ధంలో భారత రాష్ట్రసమితి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా సీనియర్ నాయకులతో కలిసి పని చేస్తామని తెలిపారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సూచన మేరకు త్వరలో జిల్లాలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జిల్లా మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియనాయక్, మెచ్చా నాగేశ్వరరావు, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులను కలిసి సూచనలు, సలహాల మేరకు బీఆర్ఎస్ బలోపేతానికి కృషిచేస్తామని తెలిపారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో పొడుతూరి రమాదేవి, పూనెం నరేష్, కనుకు సాగర్, చిప్పలపల్లి శ్రీనివాసరావు, సోడె వీరాస్వామి, భాగవతపు సతీష్, ఇసంపల్లి శివకుమార్, శేషు, సోందె వెంకటరాజు, పొడుతూరి రవీంద్రప్రసాద్, గోడేటి వెంకటేశ్వర్లు, నారపోగు రవికిరణ్, నాగేశ్వరరావు, ప్రసాదరావు ఉన్నారు.

పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర

పెనుబల్లి, మార్చి 24: మండలంలోని పలుగ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పర్యటించారు. మాజీసర్పంచ్ నాగరాజు ఇంటి వద్ద కార్యకర్తలతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. అనంతరం పాతఅగ్రహారంలో ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న కార్యకర్తను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి భూక్యా ప్రసాద్, నాయకులు లక్కినేని వినీల్, శీలం నాగిరెడ్డి, నాగదాసు, చింతనిప్పు సత్యనారాయణ, మందడపు అశోక్‌కుమార్, లగడపాటి శ్రీను, దొడ్డపునేని రవి, కృష్ణ, ఆవిటి మారేశ్వరరావు, ఆళ్ల అప్పారావు, నాగుళ్ల నరసింహారావు, నరకాల చంటి, మరీదు చంద్రశేఖర్, కోట ప్రభాకర్, వెంకీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

వేంసూరు మండలంలో..

వేంసూరు, మార్చి 24: మండలంలోని పలు కుటుంబాలను మాజీఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆదివారం పరామర్శించారు. దిద్దుపూడి గ్రామానికి చెందిన జుంజునూరి అనసూర్య, మిరియాల మధువర్ధన్ రోడ్డు, జుంజునూరు రఘు ఇటీవల ప్రమాదానికి గురికాగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపుడి మహేశ్, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మోరంపుడి శ్రీధర్, మట్టా రవి, రామకృష్ణ, మిరియాల రవి, మల్లయ్య, ఉప్పల వెంకటేశ్, శివ కృష్ణ, ప్రసాద్, జగదీశ్, గుర్రం శ్రీను, అబ్రహ్మం తదితరులు ఉన్నారు.

పెనుబల్లి: అగ్రహారంలో పరామర్శిస్తున్న మాజీఎమ్మెల్యే సండ్ర